# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు ద్వారా సాగు వ్యయం తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశమవుతుంది.**

3. **తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ మరికొద్ది సేపట్లో ప్రారంభం కానుంది.**

4. **ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

5. **ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భవానీ దీక్షల విరమణలు ఈ రోజు నుంచి ప్రారంభమైయ్యాయి.**

============================

వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు, డ్రోన్ల వినియోగం ద్వారా సాగు వ్యయం తగ్గించి రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. పత్తి, మిరప సహా వివిధ వాణిజ్య పంటల కొనుగోళ్లపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయానికి అవసరమైన ఆధునిక సాగు యంత్ర పరికరాల కోసం వ్యవసాయ సామాగ్రి బ్యాంక్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు, వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని సూచించారు. వాణిజ్య పంటలకు కనీస మద్ధతు ధర దక్కేలా పంటకోత ప్రక్రియలో హేతుబద్ధమైన విధానాలను పాటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశం కానుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తో పాటు మంత్రుల ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేశంలో అమరావతి నిర్మాణానికి నాబార్డు రుణం తీసుకునేందుకు అనుమతి, సీడ్ యాక్సిస్ రహదారిని 16వ జాతీయ రహదారికి అనుసంధించే పనులకు మంత్రి

వర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అలాగే పలు సంస్థలకు భూ కేటాయింపులు లోక్ భవన్ నిర్మాణానికి టెండర్లు పిలిచే అంశాలపైనా రాష్ట్ర మంత్రి వర్గం చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ మరికొద్ది సేపట్లో ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సూచించారు. హైదరాబాద్‌లో ఆమె నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఉదయం 7.00 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందని అన్నారు. తొలి దశలో 56 లక్షల 19 వేల 430 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు.

వాయిస్..30 సెకన్లు

తెలంగాణలో మొత్తం మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. తొలి దశ ఈరోజు జరుగుతుండగా.. రెండో దశ ఈనెల 14న, మూడో దశ ఈనెల 17వ తేదీన జరగనున్నాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విశాఖపట్నం భాగస్వామ్య సదస్సులో భాగంగా ప్రభుత్వం, పర్యాటక శాఖ ఒప్పందాలు కుదుర్చుకున్న టూరిజం ఇన్వెస్టర్లతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ,. ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్ట్ లకు అవసరమైన సమాచారం, ప్రోత్సాహం అందిస్తామన్నారు. త్వరితగతిన ప్రాజెక్టులు ప్రారంభించే వారికి ప్రభుత్వం సహకారం ఉంటుందని తెలిపారు. ఇతర శాఖలతో సమస్యలు ఉంటే చర్చించి పరిష్కరిస్తామని పెట్టుబడిదారులకు మంత్రి హామీ ఇచ్చారు.

---------------------------

మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతి సందర్భంగా "అటల్ సందేశ్ మోదీ సుపరిపాలనా" పేరుతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈరోజు నుంచి బస్సు యాత్రను నిర్వహించనుంది. ఈ యాత్రను ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రారంభిస్తారని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఈ నెల 25న అమరావతిలో జరిగే సభతో యాత్ర ముగుస్తుందని చెప్పారు. ఈ యాత్ర ద్వారా దేశానికి వాజ్‌పేయీ చేసిన సేవలను గుర్తు చేయనున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

ఇండిగో మినహా మిగిలిన విమానయాన సంస్థల సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయని విశాఖపట్నం విమానాశ్రయ డైరెక్టర్ పురుషోత్తం తెలిపారు. విశాఖపట్నంలో ఆయన నిన్న పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విమానాశ్రయ డైరెక్టర్ మాట్లాడుతూ, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విశాఖ విమానాశ్రయంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు 125

విమాన సర్వీసుల రాకపోకలు రద్దు కాగా.. ఇందులో ఇండిగో సర్వీసులు 122 ఉన్నాయని చెప్పారు. ప్రయాణికులకు వారి సామానులను  అప్పగించామని పురుషోత్తం తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్ లోని  విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో  భవానీ దీక్షల విరమణలు ఈ రోజు నుంచి  ప్రారంభమైయ్యాయి. ఈ నెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ ఉదయం అమ్మవారి ప్రత్యేక పూజలు అనంతరం  భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు. రేపటి  నుంచి తెల్లవారుజామున 3 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనాలు కొనసాగుతాయని,  భవానీ దీక్షల సమయంలో అంతరాలయ దర్శనాలు రద్దు చేశామని ఆలయ అధికారులు తెలిపారు. భవానీల కోసం కనకదుర్గ నగర్‌లో మూడు హోమగుండాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 4 వేల 123 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని, నిఘా కోసం 320 సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

---

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, పత్రికా సంపాదకులు, తమిళ రచయిత సుబ్రమణ్య భారతి జయంతి ఈ రోజు. 1882వ సంవత్సరం డిసెంబర్ 11వ తేదీన తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లా ఎట్టాయపురం గ్రామంలో జన్మించారు. ఆయన తిరునల్వేలి ..., వారణాసి పట్టణాలలో విద్యాభ్యాసం చేసి పాత్రికేయ రంగంలో ప్రవేశించారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. బ్రిటిష్ వారి దాస్య శృంఖలాల నుండి దేశ విముక్తి కోసం అందరూ కృషి చేయాలని తన రచనల ద్వారా  ప్రజలలో దేశభక్తిని కదిలించిన సుబ్రమణ్య భారతి   1921 సెప్టెంబర్ 12 వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---

ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ఉభయ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టులో కనిష్ఠంగా 4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవ్వగా తెలంగాణలోని కుమురం భీం ఆసిఫాబాద్‌లో 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైయింది.

---

ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ -సర్ జరుగుతున్న 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో బూత్-స్థాయి ఏజెంట్లు -BLAలకు  బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను అందించాలని  ప్రధాన ఎన్నికల అధికారులను భారత ఎన్నికల సంఘం - ECI ఆదేశించింది. బీహార్‌లో చేపట్టినట్లుగానే, గైర్హాజరు, బదిలీ చేయబడిన, మరణించిన లేదా నకిలీగా గుర్తించిన ఓటర్ల జాబితాలను రాజకీయ పార్టీల BLAలకు అందిస్తామని ఎన్నికల సంఘం పేర్కొంది. అలాగే ఓటర్ల జాబితాల ప్రచురణకు ముందు రాజకీయ పార్టీలు జిల్లా అధ్యక్షులు నియమించిన BLAలకు జాబితాలను అందిజేస్తామని తెలిపింది. ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ తర్వాత ఈ జాబితాలను ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్‌లలోనూ  అప్‌లోడ్ చేస్తామని ఎన్నికల సంఘం తెలిపింది.

---

కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న" విత్తన చట్టం-2025"లో రైతు ప్రయోజనాలకు ప్రాధ్యానత ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. విత్తన చట్టం ముసాయిదాలో తెలంగాణ ప్రభుత్వం తరఫున చేర్చాల్సిన అంశాలు, అభ్యంతరాలపై తుది నివేదిక రూపకల్పనపై హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

======================